సాక్షి మహబూబాబాద్

బుధవారం | 18 | జనవరి | 2023



ఈఓ వద్దకు పూజారుల వాటా పంచాయితీ

మేడారం సమ్మక్క పూజారి వాటా పంచాయితీ ఈఓ రాజేంద్రం వద్దకు చేరింది. తనను గద్దెపైకి రానివ్వడం లేదని పూజారి లక్ష్మణ్‌రావు ఈఓ దృష్టికి తీసుకెళ్లారు.

- 8లో▸



మల్లన్న ఆలయంలో మహాసంప్రోక్షణ

- 8లో▸

ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయంలో అత్యంత వైభవోపేతంగా జరిగిన సంక్రాంతి పండుగ జాతర ఉత్సవాలు ముగిశాయి.

వాతావరణం

గరిష్టం/కనిష్టం $33.4^0 / 15.7^0$

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. చలి తీవ్రత కాస్త తగ్గుతుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది.

న్యూస్‌రీల్

జనసమీకరణను బాధ్యతగా తీసుకోవాలి



బయ్యారం: ఖమ్మం బీఆర్‌ఎస్ ఆవిర్భావ సభకు మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు జనసమీకరణను బాధ్యతగా తీసుకోవాలని టీఎస్ ఎంఎస్ఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, జెడ్పీ చైర్‌పర్సన్ ఆంగోతు బిందు అన్నారు. మంగళవారం బయ్యారంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతిఇంటి నుంచి బహిరంగసభకు ఒకరు వచ్చేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు గణేష్, ఉపాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, సొసైటీ ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, ఎంపీటీసీ భద్రయ్య, మండల కో–ఆప్షన్ సభ్యుడు బాబా, ఆర్‌ఎస్‌ఎస్ మండల కన్వీనర్ ఉప్పలయ్య, మండల ఇన్‌చార్జ్ మనోజ్‌కుమార్ తో పాటు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్‌గా విజయ్



నెహ్రూసెంటర్: తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్‌గా మహబూబాబాద్ డివిజన్ ఇంజనీర్ (డీఈ) గా విధులు నిర్వర్తిస్తున్న పి.విజయ్‌ని నియమించినట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్యాం మనోహర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ మంగళవారం తెలిపారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర బాధ్యులకు డీఈ పి.విజయ్ కృతజ్ఞతలు తెలిపారు.

నేడు మార్కెట్‌కు సెలవు

కేసముద్రం: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌కు బుధవారం సెలవు ప్రకటించినట్లు స్పెషల్ గ్రేడ్ సెక్రటరీ అమరలింగేశ్వరరావు మంగళవారం తెలిపారు. హమాలీ కార్మికుడు శ్రీను మృతి చెందగా.. వ్యాపారస్తుల కోరిక మేరకు మార్కెట్‌కు సెలవు ప్రకటించినట్లు తెలిపారు.

మానుకోట మార్కెట్‌కు..

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌కు బుధవారం సెలవు ప్రకటించినట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి జి.రాజేందర్ మంగళవారం తెలిపారు. దడువాయి సంఘం కోరిక మేరకు సెలవు ప్రకటించామని, రైతులు గమనించాలని ఆయన కోరారు.

ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ల ఎంపిక



నెహ్రూసెంటర్: జిల్లా పరిధిలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ (ఎంఎల్‌హెచ్‌పీ) డాక్టర్ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మంగళవారం మానుకోటలోని ఐఎంఏ హాల్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించి 51మందిని ఎంపిక చేసినట్లు డీఎంహెచ్‌ఓ హరీశ్‌రాజ్ తెలిపారు. మెరిట్ అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను పరిశీలించి ఎంపిక చేశామన్నారు. ఎంపికైన వారు కేటాయించిన సబ్ సెంటర్లలో విధులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు.

నేటి డిగ్రీ పరీక్షలు వాయిదా

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో బుధవారం నిర్వహించాల్సిన డిగ్రీ బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ తదితర కోర్సుల మూడో సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ జి.మధుకర్, డాక్టర్ ఎ.నరేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. అనివార్య కారణాల వల్ల పరీక్షలు వాయిదా వేశామని, మిగితా పరీక్షలు యథావిధిగా టైంటేబుల్ ప్రకారమే నిర్వహిస్తామని పేర్కొన్నారు. వాయిదా పడిన మూడో సెమిస్టర్ పరీక్షలు ఫిబ్రవరి 8న నిర్వహించనున్నట్లు తెలిపారు.

డిగ్రీ పరీక్షల్లో పది మంది డీబార్

కేయూ క్యాంపస్: కేయూ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో మంగళవారం నిర్వహించిన డిగ్రీ బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ తదితర పరీక్షల్లో వివిధ కేంద్రాల్లో కాపీయింగ్ చేస్తూ పది మంది విద్యార్థులు డీబార్ అయినట్లు పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ జి.మధుకర్, డాక్టర్ ఎ.నరేందర్ తెలిపారు.

చలో ఖమ్మం

- దారులన్నీ నేటి బీఆర్‌ఎస్ బహిరంగ సభ వైపే..
- జిల్లా నుంచి లక్షకుపైగా ప్రజల తరలింపు
- నియోజకవర్గాల వారీగా టార్గెట్
- ఐదు రోజులు శ్రమించిన మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు



మానుకోట పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే శంకర్‌నాయక్

సాక్షి, మహబూబాబాద్: బీఆర్‌ఎస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా ఖమ్మంలో నిర్వహించే బహిరంగ సభకు జిల్లా నుంచి భారీగా జనాలను తరలించేందుకు నాయకులు శ్రమించారు. నేటి సభను విజయవంతం చేయడంలో జిల్లా కీలకం కానుంది. లక్షకుపైగా జనాలను తరలించేందుకు మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు చెమటోడ్చారు. నాలుగు జాతీయ పార్టీల నాయకులు, ముఖ్యమంత్రులు హాజరయ్యే సభకు భారీ జన సమీకరణతో బీఆర్‌ఎస్ బలం నిరూపించనున్నారు. కాగా జిల్లాలోని దారులన్నీ ఖమ్మం సభ వైపే సాగనున్నాయి.

సభ సక్సెస్ కోసం..

బీఆర్‌ఎస్ పార్టీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుతో పాటు ఢిల్లీ, కేరళ, పంజాబ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొనే ఖమ్మం సభ విజయవంతం చేసేందుకు జిల్లా నాయకులు ఐదు రోజులుగా చెమటోడ్చారు. డోర్నకల్, పాలకుర్తి నియోజకవర్గాల నుంచి జనాలను తరలించే బాధ్యతలను రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తీసుకున్నారు. మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత, డీఎస్ రెడ్యానాయక్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ గుడిపూడి నవీన్‌రావుతో కలిసి సమీక్షలు నిర్వహించారు. అన్ని మండలాలు, మేజర్ గ్రామ పంచాయతీల్లో పార్టీ ముఖ్య నాయకులతో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. నాయకుడి స్థాయిని బట్టి ఎంత మందిని సభకు తరలించాలో దిశానిర్దేశం చేశారు. స్థానికంగా ఉన్న గ్రూపు తగాదాల పరిస్థితిని ఆరా తీశారు. వారికి మంత్రి దయాకర్‌రావు ఫోన్ ద్వారా సర్దిచెప్పి, సభ సక్సెస్ కోసం భేషజాలను పక్కన పెట్టాలని బుజ్జగించారు. అదేవిధంగా రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ మహబూబాబాద్ నియోజకవర్గం బాధ్యతలు తీసుకొని ఎమ్మెల్యే శంకర్‌నాయక్, ఎమ్మెల్సీ రవీందర్‌రావుతో పాటు ముఖ్య నాయకులను కలుపుకొని ఆత్మీయ సమ్మేళనాలు ఏర్పాటు చేశారు. ఖమ్మం సభ ప్రాధాన్యతను వివరించారు. సభ విజయవంతానికి చేపట్టాల్సిన ప్రణాళికను వివరించారు.

లక్షకుపైగా జనం తరలింపు..

ఖమ్మంలో జరిగే బీఆర్‌ఎస్ బహిరంగసభకు జిల్లా నుంచి లక్షకుపైగా జనాలను తరలించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. మానుకోట జిల్లా నుంచి ఎక్కువ మందిని తరలించాలని సభ నిర్వహణ బాధ్యతలు చూస్తున్న మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు. దీంతో మహబూబాబాద్ నుంచి 50వేలు, డోర్నకల్ నుంచి 40వేలు, పాలకుర్తి నియోజకవర్గంలోని తొర్రూరు, పెద్దవంగర నుంచి 20వేలు, ఇల్లెందు నియోజకవర్గంలోని బయ్యారం, గార్ల నుంచి 20వేల మందిని తరలించేందుకు సిద్ధమయ్యారు.

ఖమ్మం వైపే..

లక్షకు మించి ప్రజలు బహిరంగ సభకు తరలివెళ్లనున్న నేపథ్యంలో మహబూబాబాద్‌లోని మారుమూల ప్రాంతాల్లోని దారులన్నీ ఖమ్మం వైపు సాగనున్నాయి. గ్రామం, మండలం, నియోజకవర్గం ఇలా విభజించి ఇన్‌చార్జ్‌లను నియమించారు. ఎంత మంది వస్తున్నారు.. ఎన్ని వాహనాలు అవసరం .. భోజనాలు.. ఇతర వసతులు కల్పించే బాధ్యతలు అప్పగించారు. వెయ్యి వరకు బస్సులు, డీసీఎంలు, లారీలు, ఇతర వాహనాలను ఏర్పాటు చేశారు.

బహిరంగ సభకు తరలిరావాలి

- మంత్రి సత్యవతిరాథోడ్

మహబూబాబాద్: ఖమ్మంలో నేడు(బుధవారం) జరిగే బీఆర్‌ఎస్ భారీ బహిరంగ సభకు ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని మంత్రి సత్యవతి రాథోడ్ పిలుపునిచ్చారు. సభను సక్సెస్ చేయాలని కోరుతూ మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యవతిరాథోడ్ మాట్లాడుతూ.. దేశ చరిత్రను మార్చేలా బీఆర్‌ఎస్ ఆవిర్భావ సభ ఉంటుందన్నారు. జిల్లా నుంచి 1,20,000 మందిని సభకు తరలించడం లక్ష్యం కాగా.. వస్తున్న స్పందనను చూస్తుంటే అంతకుమించి వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ నాయకత్వం దేశానికి అవసరమని, తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు దేశంలోనే ఆదర్శంగా నిలిచాయని కొనియాడారు. కాగా బైక్ ర్యాలీ క్యాంపు కార్యాలయం నుంచి నెహ్రూసెంటర్, అండర్ బ్రిడ్జి మీదుగా మదర్ థెరిసా సెంటర్, ఆర్టీసీ బస్టాండ్, నర్సంపేటరోడ్డు మీదుగా వ్యవసాయ మార్కెట్ నుంచి తిరిగి క్యాంపు కార్యాలయానికి చేరుకుంది. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్, మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మహ్మద్‌ఫరీద్, పార్టీ నాయకులు యాళ్ల మురళీధర్‌రెడ్డి, గద్దె రవి, రాజు, బాలు, రంజిత్, రాజశేఖర్, నరేష్, రావిష్, రామరాజు, యాకన్న తదితరులు పాల్గొన్నారు.

సభకు జనాలను తరలించాలి

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు

తొర్రూరు/కురవి: ఖమ్మంలో నేడు(బుధవారం) నిర్వహించే బీఆర్‌ఎస్ ఆవిర్భావ సభకు జనాలను భారీగా తరలించాలని రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మంగళవారం బహిరంగ సభ సన్నాహక సమావేశం డివిజన్ కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. ఖమ్మం సభకు భారీ సంఖ్యలో జనాలను తరలిస్తున్నామని తెలిపారు. బీఆర్‌ఎస్ ఆవిర్భావం తర్వాత తొలి బహిరంగ సభ కాబట్టి అత్యంత ఘనంగా, దేశవ్యాప్తంగా చర్చ జరిగేలా నిర్వహిస్తున్నామన్నారు. సభకు పాలకుర్తి నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో ప్రజలను తరలించాలన్నారు. సమావేశంలో లింగాలఘణపురం జెడ్పీటీసీ వంశీధర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సీతారాములు, మున్సిపల్ చైర్మన్ రామచంద్రయ్య, జెడ్పీటీసీ శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ హరిప్రసాద్, ఈజీఎస్ రాష్ట్ర డైరెక్టర్ వెంకటనారాయణగౌడ్, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ సోమేశ్వర్‌రావు, వైస్ ఎంపీపీ శ్యాం సుందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, జీసీసీ మాజీ చైర్మన్ గాంధీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

కురవిలో..

బీఆర్‌ఎస్ బహిరంగ సభను విజయవంతం చేయాలని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కోరారు. మంగళవారం కురవిలో బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులతో కలిసి సభకు జన సమీకరణపై సమీక్షించారు. మంత్రి మాట్లాడుతూ.. ప్రతి గ్రామం నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలను తరలించాలని సూచించారు. ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు తోట లాలయ్య, బజ్జూరి పిచ్చిరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, కొండపల్లి శ్రీదేవి, ఎర్రంరెడ్డి సుధాకర్‌రెడ్డి, నూతక్కి నర్సింహారావు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



సిబ్బందితో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

దంతాలపల్లి: అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్ హెచ్చరించారు. కంటివెలుగు కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని ఆమె మంగళవారం సందర్శించారు. కంటి వెలుగు ఏర్పాట్లపై ఆరా తీశారు. సిబ్బందికి ఏయే బాధ్యతలు అప్పగించారని ప్రశ్నించగా.. వారి నుంచి ఎలాంటి సమాధానం రాకపోవడంతో అదనపు కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మీకు శిక్షణ ఇవ్వలేదా.. ఇలా అయితే కంటి సమస్యలతో వచ్చే వారికి ఎలా పరీక్షలు చేస్తారని మండిపడ్డారు. ప్రతిరోజు 350మందికి కంటి పరీక్షలు చేయాలని ఆదేశించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివాని, ఎంపీడీఓ గోవిందరావు, వైద్యులు చైతన్య, స్పందన, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు..

చలి నుంచి ఉపశమనం

మానుకోట సమీపంలోని కంబాలచెరువులో మంగళవారం ఉదయం సూర్యోదయం అనంతరం చలి తీవ్రతను తట్టుకోలేక నీటికొంగలు చెరువు మధ్యలో బండపైకి చేరాయి. ఎండవేడి తగిలి చలినుంచి ఇలా ఉపశమనం పొందాయి.

– సాక్షి, స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, మహబూబాబాద్



స్వచ్ఛందంగా ముందుకు రావాలి

- కంటి వెలుగు కార్యక్రమం విజయవంతం చేయాలి
- కలెక్టర్ శశాంక



బయ్యారం సర్పంచ్ కోటమ్మకు మాక్ కంటిపరీక్ష చేయిస్తున్న కలెక్టర్ శశాంక

మహబూబాబాద్: ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పరీక్షలు చేయించుకొని కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ శశాంక కోరారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. నేడు ఖమ్మం జిల్లాలో సీఎం కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభిస్తారని, జిల్లాలో 19న కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. 38 కేంద్రాల్లో ఉదయం 9గంటల నుంచే కంటి పరీక్షలు చేపడుతారని పేర్కొన్నారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, మహిళా సంఘాలు, అంగన్‌వాడీల ద్వారా ప్రచారం చేయగా.. అర్బన్ ప్రాంతాల్లో వార్డు ఆఫీసర్, మెప్మా, అంగన్‌వాడీల ద్వారా విస్తృత ప్రచారం చేశామని తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కంటి పరీక్షలు చేయించుకోవాలని కోరారు. జిల్లాకు 32,608 రీడింగ్ కళ్లజోళ్లు రాగా.. పీహెచ్‌సీలకు సుమారు 23,000 కళ్లజోళ్లు సరఫరా చేశామన్నారు. అంధత్వ రహిత తెలంగాణే లక్ష్యంగా ప్రభుత్వం కార్యక్రమం చేపడుతుందన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్, డీఎంహెచ్‌ఓ హరీశ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు ఏర్పాట్ల పరిశీలన

బయ్యారం: మండల కేంద్రంలో కంటి వెలుగు కార్యక్రమ ఏర్పాట్లను మంగళవారం కలెక్టర్ శశాంక పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని తనిఖీ చేశారు. అనంతరం అక్కడ ఉన్న వైద్యసిబ్బంది ద్వారా కంటి పరీక్షలు నిర్వహించే తీరును తెలుసుకొని పలు సూచనలు చేశారు. ఆ తర్వాత బయ్యారం సర్పంచ్ కోటమ్మకు కలెక్టర్ దగ్గరుండి మాక్ కంటి పరీక్ష చేయించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ అంబరీష, కంటి వైద్య నిపుణులు సత్యనారాయణ, తహసీల్దార్ రమేష్, ఎంపీడీఓ చలపతిరావు, బయ్యారం వైద్యాధికారి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి ఐడీఓసీ భవనంలోనే కార్యకలాపాలు

మహబూబాబాద్: నేటి(బుధవారం) నుంచి ఐడీఓసీ భవనంలో అధికారిక కార్యకలాపాలు ప్రారంభించాలని కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడీఓసీ కార్యాలయాన్ని కలెక్టర్ సందర్శించి వసతులను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఇంటర్‌నెట్ కనెక్షన్ ఇవ్వాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. శాఖల వారీగా గదులను కేటాయించడంతో పాటు ఆయాశాఖలపేర్లతో బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. అదనపు కలెక్టర్ డేవిడ్, సీపీఓ సుబ్బారావు, ఆర్‌అండ్‌బీ ఈఈ తానేశ్వర్ తదితరులు ఉన్నారు.

సర్వం సిద్ధం!

- రేపు కంటి వెలుగు రెండో విడత కార్యక్రమం ప్రారంభం
- జిల్లాలో 82 మున్సిపల్ వార్డులు, 461జీపీల్లో ఏర్పాట్లు పూర్తి
- 38 బృందాలు, ప్రతిరోజు 300 మందికి కంటి పరీక్షలు
- జిల్లాకు చేరిన రీడింగ్ గ్లాసులు



శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్ (ఫైల్)

నెహ్రూసెంటర్: అంధత్వ రహిత తెలంగాణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు రెండో విడత కార్యక్రమం ఈ నెల 19న ప్రారంభం కానుంది. ఇందుకు కావాల్సిన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. జిల్లాలో 18 సంవత్సరాలు పైబడిన 6.18లక్షల మందికి పరీక్షలు నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. 18 మండలాలు, 461జీపీలు, 4 మున్సిపాలిటీలు, 82 వార్డులు, 173 సబ్‌సెంటర్లలో పరీక్షలు నిర్వహించనున్నారు. కాగా 38 బృందాలను ఏర్పాటు చేయగా.. ప్రతి బృందంలో ఎనిమిది సిబ్బంది ఉంటారు. ఇప్పటికే డాక్టర్లు, సిబ్బంది నియామకం చేపట్టి వారికి అవగాహన కార్యక్రమాలు చేపట్టారు.

38 బృందాలు..

కంటి పరీక్షల కోసం 38 బృందాలను ఏర్పాటు చేశారు. ప్రతి బృందంలో 8 మంది సిబ్బంది ఉంటారు. అందులో వైద్యాధికారి, ఆప్తాలమిస్ట్, హెల్త్ సూపర్‌వైజర్, పారామెడికల్, ఇద్దరు ఏఎన్‌ఎంలు, డాటా ఎంట్రీ ఆపరేటర్, ఇద్దరు ఆశకార్యకర్తల ఆధ్వర్యంలో కార్యక్రమం కొనసాగుతుంది. ప్రతి రోజు జీపీ సెంటర్‌లో 300 మందికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి వెంటనే రీడింగ్ గ్లాసులు అందిస్తారు. ఆపరేషన్ అవసరమైన వారికి ఆస్పత్రుల్లో ఏర్పాట్లు చేశారు. జిల్లాలో కార్యక్రమం నిర్వహణ కోసం 40 వాహనాలను ఏర్పాటు చేశారు.

వారు భాగస్వాములు..

గ్రామస్థాయిలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలను, ఇతర ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేస్తూ కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈమేరకు ప్రజాప్రతినిధులకు సమాచారం అందించారు. కార్యక్రమ నిర్వహణ కోసం జీపీకి రూ. 1,000 చొప్పున కేటాయించారు. కంటి వెలుగు కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలకు తాగునీరు, ఇతర సౌకర్యాలు కల్పించనున్నారు.

వంద రోజుల పాటు..

రాష్ట్ర ప్రభుత్వం అంధత్వ నివారణకు చేపట్టిన కంటి వెలుగు రెండో విడత కార్యక్రమం వంద రోజుల పాటు నిర్వహించనున్నారు. ప్రతి రోజుల 300మందికి కంటి పరీక్షలు నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. అలాగే సిబ్బంది ఒక్కొక్కరికి భోజన ఖర్చులతో కలిసి రూ.1,500 చెల్లిస్తూ.. దగ్గరలో ఉన్న వసతి గృహాల్లో ఉచితంగా ఉండేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

మొదటి విడతలో 5.8 లక్షల మందికి పరీక్షలు..

జిల్లాలో మొదటి విడతలో 5.8 లక్షల మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 60వేల మందికిపైగా రీడింగ్ గ్లాసులను అందించగా 6 వేల మందికి కంటి శస్త్రచికిత్సలు చేశారు. రెండో విడతలో ప్రతి ఒక్కరికి కంటి పరీక్షలు నిర్వహించేలా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

సద్వినియోగం చేసుకోవాలి



జిల్లాలో ప్రారంభంకానున్న కంటి వెలుగు రెండో విడత కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని కంటి పరీక్షలు చేయించుకోవాలి. జిల్లాలోని గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డుల్లో శిబిరాలను ఏర్పాటు చేశాం. అవసరమైన వారికి వెంటనే గ్లాసులు అందజేస్తాం. శస్త్రచికిత్సలు కూడా ఉచితంగా చేస్తాం. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకొని అంధత్వ నివారణకు కృషి చేయాలి.

–హరీశ్‌రాజ్, డీఎంహెచ్‌ఓ

టోర్నీకి వేళాయె

- మరిపెడలో జాతీయస్థాయి ఇండోర్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు
- 19నుంచి 22వ తేదీ వరకు నిర్వహణ
- ముస్తాబవుతున్న ఆడిటోరియం
- పలు రాష్ట్రాల నుంచి తరలిరానున్న క్రీడాకారులు



మరిపెడలోని ఇండోర్ స్టేడియం

మరిపెడ రూరల్: జిల్లాలోని మరిపెడ మండల కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో ఈనెల 19నుంచి 22వ తేదీ వరకు జాతీయస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాపోటీలు నిర్వహించనున్నారు. ఈ ఇండోర్ పోటీల్లో తెలుగు రాష్ట్రాలతో పాటు పలు పక్క రాష్ట్రాల నుంచి క్రీడాకారులు తలపడనున్నారు. రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు హాజరైన క్రీడాకారులు సైతం పాల్గొననున్నారు.

14వ సారి క్రీడోత్సవాలు

గతంలో 13సార్లు జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ గుడిపూడి నవీన్ సారథ్యంలో క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ ఏడాది 14సారి జాతీయస్థాయి పోటీలను నిర్వహించనున్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే క్రీడాకారులకు ఎలాంటి లోటు రానివ్వకుండా భోజనం, బస వసతులు కల్పిస్తున్నారు.

రూ.3.40లక్షల ప్రైజ్ మనీ..

ఇండోర్ షటిల్ టోర్నమెంట్ పోటీలో విజేతలకు భారీగా నగదు పురస్కారాలు అందించనున్నారు. ఇందుకు రూ.3.40లక్షల ప్రైజ్ మనీతో పాటు 21మొమెంటోలు ప్రదానం చేయనున్నారు. ఈ టోర్నీలో అండర్–17విభాగంలో బాల, బాలికలకు సింగిల్, డబుల్స్‌కు అవకాశాలు కల్పించారు. ఓపెన్ విభాగంలో పురుషులకు సింగల్, డబుల్ పోటీలు ఉంటాయి. 40 ఏళ్ల వయసు దాటిన పురుషులకు కేవలం డబుల్స్ పోటీలు నిర్వహించనున్నారు. ఆసక్తి గల క్రీడాకారులు సోమవారం నుంచే ఆన్‌లైన్ ద్వారా తమ ఎంట్రీలు నమోదు చేసుకుంటున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

జాతీయస్థాయిలో నిర్వహించే ఇండోర్ షటిల్ టోర్నమెంట్‌కు ఏటా మంచి ఆదరణ లభిస్తోంది. వివిధ రాష్ట్రాల నుంచి ఎంతో ప్రావీణ్యం పొందిన క్రీడాకారులు వచ్చి ఇక్కడ తలపడుతున్నారు. క్రీడాకారులు తమ సొంత ప్రతిభతోనే ఎదగాలి. నాలుగురోజుల పాటు ఇక్కడ నిర్వహించే క్రీడాపోటీల్లో సత్తాచాటి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలి. క్రీడల్లో రాణిస్తే క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుంది.

–నవీన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, క్రీడోత్సవాల స్పాన్సర్, ఆర్గనైజర్

రైతుల డబ్బులు జమ చేస్తే చర్యలు



రైతులతో మాట్లాడుతున్న ఎంపీ కవిత

కురవి: రైతులకు పెట్టుబడిసాయంగా సీఎం కేసీఆర్ రైతుబంధు డబ్బులు పంపుతుంటే మీరు(బ్యాంకర్లు) పాత అప్పులో జమ చేసుకుంటారా? అలా చేస్తే చర్యలు తీసుకుంటామని ఎంపీ మాలోత్ కవిత బ్యాంకు అధికారులను హెచ్చరించారు. మంగళవారం కురవిలోని ఆంధ్రాబ్యాంకు కర్షక సేవా సహకార సంఘానికి వచ్చిన ఎంపీని రైతులు వచ్చి కలిశారు. తమ డబ్బులను పాత అప్పుల కింద జమ చేసుకుంటున్నారని వివరించారు. దీంతో స్పందించిన ఎంపీ కవిత కలెక్టర్ శశాంకతో ఫోన్‌లో మాట్లాడారు. డబ్బులు జమ చేసుకోవడం పునరావృతం కావొద్దని, సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న పథకం లక్ష్యాన్ని దెబ్బతీయొద్దన్నారు. దీంతో రైతులు ఎంపీ కవితకు కృతజ్ఞతలు తెలిపారు.

హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలి

మహబూబాబాద్ అర్బన్: ఫిబ్రవరిలో నిర్వహించే టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సులు డ్రాయింగ్ లోయర్, హయ్యర్, టైలరింగ్, ఎంబ్రాయిడరింగ్ లోయర్, హయ్యర్ పరీక్షల హాల్ టికెట్లను అభ్యర్థులు డౌన్‌లోడ్ చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు మంగళవారం తెలిపారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్‌ఈ.తెలంగాణ.గౌట్.ఇన్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు జిల్లా ఏసీజీ మందుల శ్రీరాములును 9849761012 ఫోన్ ద్వారా సంప్రదించాలని, పూర్తి వివరాలు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో తెలుసుకోవాలన్నారు.

క్లుప్తంగా

రైలు ఢీకొని యువతి మృతి


ప్రగతి (ఫైల్)

కాశిబుగ్గ: రైలు ఢీకొని యువతి మృతి చెందిన సంఘటన వరంగల్, చింతలపల్లి రైల్వేస్టేషన్ల మధ్య సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. వరంగల్ జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ధనసరికి చెందిన చాగంటి ప్రగతి(18) తల్లిదండ్రులు చిన్నతనంలోనే చనిపోయారు. వరంగల్ అబ్బనికుంటలోని తన పిన్ని వద్ద ఉంటూ ఎల్‌బీ కళాశాలలో డిగ్రీ సెకండ్ ఇయర్ చదువుతోంది. చిన్నతనం నుంచి పోలీస్ కావాలనే ఆశయంతో ఎన్‌సీసీలో శిక్షణ పొందుతుంది. ఈ నెల 12న ఎన్‌సీసీ క్యాంపునకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి నర్సంపేటలోని స్నేహితురాలి ఇంటికి వెళ్లింది. తిరిగి 16వ తేదీ సాయంత్రం నర్సంపేట నుంచి బస్సులో వరంగల్‌కు చేరుకుంది. పట్టాల వెంట నడుచుకుంటూ ఇంటికి వెళ్తున్న క్రమంలో చింతల్ రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో వరంగల్‌కు వచ్చే కృష్ణా ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొట్టింది. దీంతో ప్రగతి అక్కడికక్కడే మృతి చెందింది. ఎంజీఎంలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని మంగళవారం మృతురాలి పిన్నికి అప్పగించారు. ప్రగతి మృతిపై అనుమానం వ్యక్తం చేయడంతో విచారణ జరుపుతున్నట్లు జీఆర్పీ సీఐ తెలిపారు.

మూడో రైల్వేలైన్ సర్వేకు అధికారుల రాక


హెలికాప్టర్ వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న సీఐ మహేందర్‌రెడ్డి

కాజీపేట రూరల్: దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ జోన్ పరిధిలో గల విజయవాడ-మధ్యప్రదేశ్‌లోని ఇటార్సీ వరకు మూడో రైల్వేలైన్ ట్రాక్‌కు సంబంధించిన జీపీఎస్ ఏరియల్ సర్వే కోసం ఇంజనీరింగ్ అధికారులు మంగళవారం హెలికాప్టర్‌లో కాజీపేట సేయింట్ గ్యాబ్రియల్ గ్రౌండ్‌కు చేరుకున్నారు. విజయవాడ నుంచి సర్వే చేసుకుంటూ బయలుదేరిన హెలికాప్టర్‌లో ఇంధనం అయిపోరావడం, సాయంత్రం కావడంతో ఎయిర్‌లైన్స్ అధికారుల ఆదేశానుసారం కాజీపేటలో ల్యాండింగ్ అయినట్లు అధికారులు తెలిపారు. కాజీపేటలో రాత్రి బస చేసి ఏరియల్ సర్వే నిమిత్తం బుధవారం హెలికాప్టర్‌లో వెళ్లనున్నట్లు పేర్కొన్నారు. పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హెలికాప్టర్ వద్ద బందోబస్తు ఏర్పాటు చేసినట్లు కాజీపేట సీఐ గట్ల మహేందర్ రెడ్డి తెలిపారు.


పవిత్ర జలంతో మహా సంప్రోక్షణ చేస్తున్న ఆలయ అర్చకులు


స్వామివారికి వస్త్రాలు సమర్పిస్తున్న కూనూరు పూజారులు


మల్లన్నను దర్శించుకుంటున్న ట్రిబ్యునల్ జడ్జి సత్యేంద్ర

మల్లన్న ఆలయంలో మహాసంప్రోక్షణ

- శ్వేత లింగానికి అభిషేకం, అన్నపూజ
- కూనూరు ఉమామహేశ్వర ఆలయం నుంచి స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాల సమర్పణ

ఐనవోలు: ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయంలో అత్యంత వైభవోపేతంగా జరిగిన మకర సంక్రాంతి పండుగ జాతర ఉత్సవాలు ముగిశాయి. ఆలయ సంప్రదాయం ప్రకారం మంగళవారం పండితుల వేద మంత్రోచ్ఛరణల మధ్య మహాసంప్రోక్షణ నిర్వహించారు. ఉదయమే ఆలయ ఉపప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్ ఆధ్వర్యంలో గర్భాలయాన్ని శుద్ధి చేయగా ఒగ్గు పూజారులు స్వామివారిని మేలు కొలిపారు. స్వామి, అమ్మవార్లకు నూతన వస్త్రాలు అలంకరించారు. అర్చకులు స్వామివారి బండారి(పసుపు) నీటిలో కలిపి మామిడి ఆకును కలశంలో ఉంచి మేళతాళాల నడుమ వేద మంత్రోచ్ఛరణలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణగా తిరుగుతూ భ్రమరాంభిక, ఎల్లమ్మ ఆలయాలతో పాటు అన్ని కార్యాలయాలను పవిత్ర జలంతో శుద్ధిచేశారు. గణపతి పూజ, పుణ్యాహవచనం, మహాన్యాస పూర్వక శత రుద్రాభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం లింగాకారుడిని అన్నంతో అలంకరించి అన్నపూజ చేశారు. దీంతో సంక్రాంతి నుంచి ఉగాది వరకు జరిగే జాతర, బ్రహ్మోత్సవాల్లో మకర సంక్రాంతి నాలుగు రోజుల జాతర తొలి ఘట్టం ముగిసినట్లయింది. రానున్న రోజుల్లో భ్రమరాంభిక ఆలయ వార్షికోత్సవ వేడుకలు, శివరాత్రి బ్రహ్మోత్సవాలు, శివరాత్రి రోజు పెద్దపట్నం, భ్రమరాంభిక అమ్మవారితో శివ కల్యాణం, ఉగాది ముందు వచ్చే ఆదివారం మరోసారి పెద్దపట్నం, బలిజ మేడలమ్మ, గొల్లకేతమ్మలతో ప్రత్యేకంగా మల్లన్న కల్యాణం జరపనున్నారు. నాలుగు రోజుల ఉత్సవాల్లో సుమారు 8లక్షల మంది భక్తులు పాల్గొన్నట్లు అంచనా వేస్తున్నామని ఆలయ ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు తెలిపారు. ఉగాది వరకు ప్రతి ఆది, బుధవారాల్లో స్వామివారిని భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకుంటారని, మరో ఐదు లక్షల మంది స్వామివారిని దర్శించుకునే అవకాశం ఉందని వెల్లడించారు.

పట్టువస్త్రాల సమర్పణ

లక్షలాది మంది జాతరలో పాల్గొనగా పూజలందుకున్న మల్లికార్జునస్వామి, గొల్లకేతమ్మ, బలిజ మేడలమ్మ, భ్రమరాంభిక అమ్మవార్లకు సంప్రోక్షణ అనంతరం కూనూరు ఉమామహేశ్వరస్వామి ఆలయం నుంచి అర్చకులు మధుశర్మ, సదాశివశర్మ ఆధ్వర్యంలో పట్టువస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో వేద పారాయణదారు గట్టు పురుషోత్తమ శర్మ, విక్రాంత్ వినాయక్ జోషి, అర్చకులు మధు శర్మ, భానుప్రసాద్, నరేష్‌శర్మ, శ్రీనివాస్, కూనూరు సర్పంచ్ ఇల్లందుల కుమార్, ఎంపీటీసీ శ్రీనివాస్, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నను దర్శించుకున్న జిల్లా ట్రిబ్యునల్ జడ్జి

ఐలోని మల్లన్నను హనుమకొండ జిల్లా ట్రిబ్యునల్ జడ్జి వై.సత్యేంద్ర దర్శించుకున్నారు. అర్చకులు ఆలయ సంప్రదాయం ప్రకారం ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం జడ్జి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయగా స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసి వేదమంత్రాలతో ఆశీర్వచనం చేసి శేషవస్త్రాలతో సత్కరించారు.


లింగాకారుడిని అన్నంతో అలంకరించిన దృశ్యం

తండ్రిపై పెంపుడు కుమారుడి దాడి

వర్ధన్నపేట: తల్లిదండ్రులు చిన్నతనంలోనే చనిపోగా పెంచుకున్న పిల్లవాడే తండ్రిపై కత్తిపీటతో దాడి చేసిన ఘటన వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇల్లందలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన సిరిపాటి వెంకటేశ్-యాకమ్మ దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కొన్నేళ్ల కిందట యాకమ్మ సోదరి, మరిది మృతి చెందారు. దీంతో వారి కుమారుడైన నితిన్‌ను వెంకటేశ్-యాకమ్మ దంపతులు సొంత కొడుకు వలే పెంచుకున్నారు. కాగా, నితిన్ మద్యానికి బానిసై ఇష్టారీతిగా ప్రవర్తిస్తున్నాడు. సోమవారం బాగా మద్యం తాగి రావడంతో వెంకటేష్ మందలించాడు. దీంతో కోపోద్రిక్తుడై నితిన్ కత్తిపీటతో అతడిపై దాడి చేయడంతో తొడ, చేతి మణికట్టుపై తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని వరంగల్ ఎంజీఎంకు తరలించారు. మంగళవారం యాకమ్మ ఫిర్యాదు చేయడంతో నితిన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామారావు తెలిపారు.

ప్రేమ జంట ఆత్మహత్యాయత్నం

- యువతి మృతి

ఎస్ఎస్ తాడ్వాయి: ప్రేమ జంట ఆత్మహత్యాయత్నం చేసిన ఘటనలో యువతి మృతి చెందగా, యువకుడు అపస్మారక స్థితిలో చికిత్స పొందుతున్నాడు. ములుగు జిల్లా తాడ్వాయి మండలం లింగాలలో మంగళవారం ఈ ఘటన చోటు చేసుకుంది. లింగాల గ్రామానికి చెందిన కొమురం ప్రభాస్, గంగారం మండలం దుబ్బగూడెంకు చెందిన సువర్ణపాక యమున(18) ప్రేమించుకుంటున్నారు. యమున లింగాల గ్రామంలోని తన సమీప బంధువుల ఇంటికి వచ్చింది. అక్కడ ఏం జరిగిందోగాని ప్రేమికులిద్దరు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా యమున మృతి చెందింది. ప్రభాస్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

బీఆర్ఎస్ సభ చరిత్రలో నిలిచిపోవాలి


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

మరిపెడ: ఖమ్మంలో బుధవారం(నేడు) నిర్వహించే బీఆర్ఎస్ బహిరంగ సభ చరిత్రలో నిలిచిపోయేలా జన సమీకరణ చేయాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పార్టీ నాయకులకు సూచించారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రంలోని నవీన్‌రావు అతిథి గృహంలో డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్, ఎంపీ మాలోత్ కవితతో కలిసి జనసమీకరణపై మంత్రి మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ డోర్నకల్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో బీఆర్ఎస్ పార్టీ బలంగా ఉందన్నారు. ఇక్కడ నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలను సభకు తరలించేలా నాయకులు జనసమీకరణ చేయాలన్నారు. కార్యకర్తలను తరలించే వాహనాల్లోనే లీడర్లు సభకు రావాలని సూచించారు. పార్టీ కోసం పాటుపడే నాయకులు, ప్రజాప్రతినిధుల గ్రామాలకు పంచాయతీరాజ్ శాఖ నుంచి రూ.10 లక్షల చొప్పున నిధులు మంజూరు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. అదేవిధంగా ఫిబ్రవరిలో ప్రతి నియోజకవర్గానికి 2 నుంచి 3 వేల ఇళ్లను మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపుడి నవీన్, మండల ఇన్‌చార్జ్ మెట్టు శ్రీనివాస్, జనగామ జిల్లా గ్రంథాలయ చైర్మన్ యడవెల్లి కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు అచ్చుతరావు, మహేందర్‌రెడ్డి, గడ్డం వెంకన్న, మరిపెడ ఎంపీపీ గుగులోత్ అరుణరాంబాబు, జెడ్పీటీసీ తేజావత్ శారదరవీందర్‌నాయక్, పట్టణ అధ్యక్షుడు ఉప్పల నాగేశ్వర్‌రావు, అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు, ముఖ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దాతల చేయూతకు ఎదురుచూపులు

ట్రస్ట్ చేతిలో మోసపోయిన వైద్య విద్యార్థి

- ఫీజు కట్టేందుకు ఆర్థికసాయం చేయాలని తల్లిదండ్రుల వేడుకోలు

కాజీపేట: ఓ చారిటబుల్ ట్రస్టు నిర్వాహకుడు చెప్పిన మాటలు నమ్మి వైద్య విద్య కోసం రష్యాకు వెళ్లిన విద్యార్థి ఆ ట్రస్టు చేతులు ఎత్తేయడంతో చదువు కొనసాగించలేక, తిరిగి రాలేక మనసున్న మహారాజుల సాయం కోసం అభ్యర్థిస్తున్నాడు. కాజీపేటకు చెందిన మోరోజు వంశీకృష్ణ వైద్య విద్య అభ్యసించాలనుకున్నాడు. ఏడాది ఫీజు కడితే చాలు మిగతాది స్కాలర్‌షిప్ వస్తుంది.. వైద్య విద్య పూర్తవుతుందని పుట్ట కిశోర్ చారిటబుల్ ట్రస్టు నిర్వాహకుడు చెప్పిన మాటలు నమ్మి రష్యాలోని ఏసియన్ మెడికల్ కాలేజీలో చేరాడు. ఆరు నెలలు గడవక ముందే ట్రస్టు నిర్వాహకులు ముఖం చాటేయడంతో కుటుంబ సభ్యులు అప్పు చేసి నాలుగో ఏడాది వరకు చదివించారు. ఇటీవల ఏసియన్ మెడికల్ కాలేజీ నిర్వాహకులు రూ.2లక్షలు కడితేనే ఫైనల్ ఎగ్జామ్స్ రాయనిస్తామని స్పష్టం చేశారు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు కనిపించిన వారినల్లా సాయం కోసం అభ్యర్థిస్తున్నారు. వైద్య విద్యలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించిన వంశీకృష్ణ సర్టిఫికెట్లను పట్టుకుని ప్రజాప్రతినిధులు, నాయకుల ఇళ్ల చుట్టూ తిరుగుతున్నారు. ఎక్కడా సరైనా భరోసా రాకపోవడంతో కన్నీరు పెడుతున్నారు. వంశీకి దాతలు సాయం చేస్తే ఫైనల్ ఇయర్ పూర్తిచేసే అవకాశం ఉందని వేడుకుంటున్నారు.

ఆర్థికసాయం చేయాలనుకునే వారు 91776 38463 నంబర్‌కు ఫోన్‌పే లేదా గూగుల్ పే చేయగలరు.

తైక్వాండో పోటీల్లో పేద విద్యార్థిని ప్రతిభ..

- యూపీలో జాతీయస్థాయి పోటీలు
- పాల్గొనేందుకు ఆర్థికసాయం కోరుతున్న అంకిత


తైక్వాండోలో గోల్డ్‌మెడల్ సాధించిన అంకిత

గూడూరు: మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రానికి చెందిన గొడిశాల అంకిత(ఇంటర్ విద్యార్థిని) రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించి జాతీయ స్థాయికి ఎంపికైంది. ఈ మేరకు యూపీలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు దాతలు ఆర్థిక సాయం చేయాలని కోరుతోంది. గూడూరు ఎస్సీ కాలనీకి చెందిన గొడిశాల ప్రభాకర్ - సైదమ్మ దంపతులకు ముగ్గురు ఆడ పిల్లలు. రెండో కుమార్తె అంకిత 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు కేసముద్రం మండలం ఇనుగుర్తిలోని సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో చదివింది. ప్రస్తుతం మానుకోటలోని సోషల్ వెల్ఫేర్ కళాశాలలో ఎంపీసీ చదువుతుంది. 8వ తరగతి నుంచి తైక్వాండోలో రాణిస్తున్న అంకితకు మానుకోటకు చెందిన కోచ్ రమేష్ శిక్షణ ఇస్తున్నాడు. ఈక్రమంలో జిల్లా, రాష్ట్ర స్థాయిలో గోల్డ్‌మెడల్స్ సాధించింది. గతేడాది డిసెంబర్‌లో వికారాబాద్ జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న అంకిత గోల్డ్‌మెడల్ సాధించి ఈ నెల 26 నుంచి 30 వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బరేలీ జిల్లాలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది.

పేదరికంలో కుటుంబం..

నిరుపేద కుటుంబానికి చెందిన గొడిశాల అంకిత యూపీలో జరిగే జాతీయ స్థాయి క్రీడలకు వెళ్లాలంటే సుమారు రూ.40 వేల ఖర్చు అవుతుంది. తల్లిదండ్రులు కూ లీలని, వారి వద్ద అంత పెద్ద మొత్తంలో డబ్బు లేదని అంకిత వాపోతుంది. దాతలు ఆర్థిక సాయం చేస్తే క్రీడల్లో పాల్గొని జిల్లాకు మంచిపేరు తీసుకువస్తానని వేడుకుంటోంది.

ఆర్థికసాయం చేయాలనుకునే వారు 97012 75451, 99495 12440 నంబర్లకు గూగుల్‌పే, ఫోన్‌పే చేయగలరు.


ఈఓ వద్దకు పూజారుల వాటా పంచాయితీ



ఈఓకు వినతిపత్రం అందజేస్తున్న పూజారి లక్ష్మణ్‌రావు


గద్దెకు తాళాలు వేసేందుకు ప్రయత్నిస్తున్న పూజారి కుటుంబ సభ్యులు

ఎస్ఎస్ తాడ్వాయి: సమ్మక్క పూజారి వాటా పంచాయితీ ఈఓ రాజేంద్రం వద్దకు చేరింది. తాను చేయాల్సిన డ్యూటీ చేల వంశానికి చెందిన వారు చేస్తూ తనను గద్దె పైకి రానివ్వడం లేదని సమ్మక్క పూజారి లక్ష్మణ్‌రావు మంగళవారం ఈఓ దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయమై ఈఓ గద్దెలపై డ్యూటీ చేస్తున్న చేల రామారావును పిలిపించి మాట్లాడగా తమ వంశీయులు కూడా వాటా హక్కుదారులని, దానికి సంబంధించి కోర్టు ఉత్తర్వులు కూడా ఉన్నాయని తెలిపారు. గత జాతరకు సంబంధించి తమకు రావాల్సిన వాటా మొత్తం ఇంకా చెల్లించకపోవడంతో ఆయనకు బదులుగా తాము పూజలు నిర్వహిస్తున్నామని ఈఓకు వివరించారు. దీంతో వాటాల విషయాన్ని ఇరువర్గాలు సామరస్యంగా పరిష్కరించుకోవాలని ఈఓ సూచించారు. ఈ క్రమంలో సమ్మక్క పూజారి లక్ష్మణ్‌రావు చేల వంశీయులను తన డ్యూటీలోకి రాకుండా చర్య తీసుకోవాలని ఈఓకు వినతిపత్రం అందజేశారు. అంతకు ముందు సమ్మక్క గద్దె వద్ద పూజలు చేస్తున్న చేల వంశీయులను పూజారి లక్ష్మణ్‌రావు పూజా కార్యక్రమాలు విరమించుకోవాలని కోరాడు. వారు విరమించుకోవడంతో సమ్మక్క గద్దెకు తాళాలు వేశాడు. వెంటనే ఈఓ స్పందించి సిబ్బందితో తాళాలు తీయించారు. వాటా విషయం ఉంటే పరిష్కరించుకోవాలనే గాని.. గద్దెలకు తాళాలు వేయవద్దని ఈఓ సూచించారు.

డివైడర్‌ను ఢీకొట్టిన కారు


గాయపడిన అభినవ్


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

- ఎగిరి మరో కారుపై పడిన వైనం
- రాఘవాపూర్‌లో ఘటన
- నలుగురికి గాయాలు

స్టేషన్‌ఘన్‌పూర్: నల్గొండ నుంచి కాజీపేటకు వస్తున్న కారు ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొట్టి గాలిలో ఎగిరి వరంగల్ నుంచి సికింద్రాబాద్‌కు వెళ్తున్న మరో కారుపై పడింది. ఈ ఘటనలో నలుగురు గాయపడ్డారు. జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ మండలం రాఘవాపూర్‌లో జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం ఈ ప్రమాదం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. వరంగల్ మట్టెవాడకు చెందిన ఏవీవీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ పత్రి లక్ష్మీనర్సింహప్రసాద్, ఆయన భార్య పత్రి నాగలక్ష్మీ, ఆమె కుమారుడు ప్రణీత్, డ్రైవర్ సొల్లేటి అజయ్‌కుమార్ మంగళవారం ఉదయం వరంగల్ నుంచి కారులో సికింద్రాబాద్‌కు బయలుదేరారు. అలాగే, నల్గొండకు చెందిన పురుషోత్తమ్‌రావు కొన్నేళ్లుగా కాజీపేట ఫాతిమాలో నివాసం ఉంటున్నారు. సంక్రాంతి పండుగకు స్వగ్రామమైన నల్గొండకు వెళ్లి కారులో కాజీపేటకు భార్య అమలాద్భవి రాణి, కుమారుడు వేదస్ అభినవ్‌తో కలిసి వస్తున్నారు. రాఘవాపూర్‌కు రాగానే పురుషోత్తమ్‌రావు కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి ఎగిరి లక్ష్మీనర్సింహప్రసాద్ కారుపై పడింది. ఈ ప్రమాదంలో రెండు కార్లలో ఉన్న పత్రి నాగలక్ష్మీ, బాలుడు వేదస్ అభినవ్‌కు తీవ్రగాయాలు కాగా, రాణి అజయ్‌కుమార్‌కు స్వల్పగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సాయంతో గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాఘవేందర్ తెలిపారు.


అంతర్రాష్ట్ర వంతెనపై సిమెంట్ తేలి బయటపడిన రాఫ్టర్లు


వంతెనపై ఏర్పడిన గుంతలు

‘మహా’ డేంజర్!

- వంతెనపై సిమెంట్ తేలి రాఫ్టర్లు బయటకు..
- పట్టించుకోని జాతీయ రహదారుల ఇంజనీరింగ్ అధికారులు

కాళేశ్వరం: జాతీయ రహదారే కదా అని ఆదమరిచి డ్రైవింగ్ చేస్తే అంతే. తెలంగాణ - మహారాష్ట్రలను కలుపుతూ నిర్మించి అంతర్రాష్ట్ర వంతెనపై అక్కడకక్కడా సిమెంట్ తేలిపోయి ఇనుప రాఫ్టర్లు బయటపడ్డాయి. దీంతో రాఫ్టర్లు తేలిన గుంతల్లో పడి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వాహనాలు చెడిపోతున్నాయి. ఒకవేళ అతి వేగంతో వచ్చి గుంతలో పడితే ఏకంగా వంతెన మీద నుంచి గోదావరిలో పడే అవకాశం లేకపోలేదు. ఇక కనీసం విద్యుత్ వెలుగులు కూడా లేని వంతెనపై రాత్రివేళలో ప్రయాణమంటే ‘మహా’ డేంజర్ అంటూ జనం జంకుతున్నారు. గుంతల వద్ద ఎర్ర బట్టలు, బండరాళ్లు పెట్టారు. వాటితో కూడా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. భారీ ప్రమాదాలు జరగక ముందే ఇరు రాష్ట్రాల ఎన్‌హెచ్ అధికారులు చర్యలు తీసుకొని మరమ్మతులు చేయాలని తెలంగాణ - మహారాష్ట్ర ప్రజలు కోరుతున్నారు.

స్వాములపై దొంగతనం ఆరోపణ

- పోలీస్‌స్టేషన్‌కు తరలింపు
- తులిస్యా తండాలో ప్రచారం సందర్భంగా ఘటన
- పుస్తెలతాడు దొరకడంతో కథ సుఖాంతం


దొంగతనం ఆరోపణలు ఎదుర్కొన్న స్వాములు

కురవి: మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన తుల్జా భవాని, సేవాలాల్ మహారాజ్ స్వాములు దైవ ప్రచారం కోసం మంగళవారం మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రం శివారు తులిస్యాతండా జీపీకి వెళ్లారు. తండాలో ప్రచారం చేస్తుండగా బానోత్ రెడ్యానాయక్ భార్య తన కుమార్తె జాతకం చెప్పాలని వారిని కోరింది. దీంతో స్వాములు ఆమెతో మాట్లాడి పుస్తెలతాడు బయటకు తీయమని చెప్పారు. ఆ సమయంలో పుస్తెలతాడు మెడలో లేకపోవడంతో ఆమె లబోదిబోమంది. రెడ్యానాయక్ భార్య అరుపులు విన్న చుట్టుపక్కల జనం వచ్చి స్వాములపై దొంగతనం మోపి కురవి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి పోలీసులకు అప్పగించారు. ఈ విషయమై పోలీసులు స్వాములను విచారించారు. అదే సమయంలో రెడ్యానాయక్ ఇంట్లోనే పుస్తెలతాడు ఉందని పోలీసులకు సమాచారం అందడంతో స్వాములు ఊపిరి పీల్చుకున్నారు. దొంగతనం ఆరోపణ మోపడంతో ఇబ్బంది పడ్డామని స్వాములు రాంరావు, అంకుస్, శివాజీ, సకరాలు ఆవేదనతో తెలిపారు.